క్లుప్తంగా

రేణుకాదేవి ఆలయంలో పూజలు

జోగుళాంబ శక్తిపీఠం: అష్టాదశ శక్తిపీఠాలలో ఐదో శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామివారి ఆలయ ప్రాంగణంలో వెలసిన రేణుకాఎల్లమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి మంగళవారం, శుక్రవారం రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మహిళలు సంతాన భాగ్యం కోసం ప్రత్యేక పూజలు చేస్తారు. ఇక్కడి అమ్మవారికి నవనీతం సమర్పిండం, వాటిని ప్రసాదంగా తీసుకోవడం వల్ల సంతాన భాగ్యం కలుగుతుందని భక్తుల విశ్వాసం. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులకు బ్రహ్మేశ్వర నిత్యాన్న దాన సత్రంలో భోజన సౌకర్యం కల్పిస్తున్నట్టు ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ తెలిపారు

మారమునగాల-2కు బాడీఫ్రీజ్ వితరణ



ఉండవెల్లి: మండలంలోని మారమునగాల-2 గ్రామానికి చెందిన నర్సన్‌గౌడు అదేగ్రామానికి ఉచితంగా రూ.60 వేల విలువైన బాడీఫ్రీజ్‌ను గ్రామ పంచాయతీకి అందజేశారు. మండలంలో ప్రతి గ్రామానికి అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

కోరం లేక గ్రామసభ వాయిదా



మానవపాడు: మండలంలోని పెద్దపోతులపాడు గ్రామంలో మంగళవారం జరగాల్సిన గ్రామసభ కోరం లేక వాయిదా పడిందని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇద్దరు కార్మికులను తొలగించాలని ఒక వర్గం సభ్యులు అధికారులకు వినతిపత్రం అందించారు. మంగళవారం కోరం లేక గ్రామసభ వాయిదా వేస్తున్నామని ఎంపీడీఓ తెలిపారు. గ్రామసభలో ప్రత్యేక అధికారి రాఘవేంద్ర, కార్యదర్శి ఫయాజ్, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

కాశీపూర్‌లో డ్రెయినేజీ పనులు ప్రారంభం



అలంపూర్ రూరల్: అలంపూర్ మండలంలోని కాశీపూర్‌లో మంగళవారం డ్రెయినేజీ పనులు పీఆర్ ఏఈ భరత్ పరిశీలించారు. 15వ ఆర్థిక నిధులు కింద రూ.5.25 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. డ్రెయినేజీ పనులు గ్రామపంచాయతీ భవనం నుంచి చాకలి నాగన్న ప్లాట్ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



రాజోళి: ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని మండలంలోని ఆయా గ్రామాల ఆశా వర్కర్లు మంగళవాం మెడికల్ ఆఫీసర్ మధుబాబుకు వినతిపత్రం అందజేశారు. కరోనా కాలంలో ప్రాణాలను, తమ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి, కుటుంబాలను వదిలి ప్రజలకు సేవ చేశామని గుర్తు చేశారు. తమ సేవలను గుర్తించి డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరారు. తమకు రూ.18వేల ఫిక్స్‌డ్ జీతం అందించాలన్నారు. కార్యక్రమంలో టీబీ నోడల్ పర్సన్ జయప్రకాష్, రంజిత్ కుమార్, రామకృష్ణ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

డీఈఓను సస్పెండ్ చేయాలి



గద్వాల అర్బన్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బ్లాక్‌లో పుస్తకాలను విక్రయిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోకుండా ఒత్తాసు పలుకుతున్న డీఈఓను వెంటనే సస్పెండ్ చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రవీణ్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలు పుస్తకాలు, యూనిఫాంలు, టై, బెల్టులు విక్రయిస్తూ రూ.వేలల్లో దండుకోవడంతో పాటు అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. వెంటనే నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, లేదంటే ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున్న ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు వీరేష్, గణేష్, నరేష్ ఉన్నారు.

బాలల హక్కులు సంరక్షించాలి

- పిల్లలను పనిలో పెడితే శిక్షార్హులు
- బాల్యవివాహాలు రూపుమాపాలి
- ఆయా మండలాల్లో బాలల హక్కులపై సమావేశాలు
- అవగాహన కల్పించిన సీడీపీఓలు



చింతరేవులలో మాట్లాడుతున్న సీడీపీఓ హేమలత

ధరూరు: బాల్యం పిల్లల హక్కు అని సీడీపీఓ హేమలత అన్నారు. మంగళవారం మండలంలోని చింతరేవులలో మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల హక్కుల పరిరక్షణ విభాగాల ఆధ్వర్యంలో గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సీడీపీఓ హేమలత మాట్లాడుతూ పిల్లలంతా ఆనందంగా గడిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బాలల కమిటీలు బాలల హక్కులకు భంగం కలుగకుండా చూడడంతో పాటు బాల్య వివాహాలను నివారించాలన్నారు. డీసీపీయూ కౌన్సిలర్ సురేష్ మాట్లాడారు. బాలలపై జరిగే మానసిక, శారీరక, లైంగిక వేధింపుల నుంచి రక్షణ కోసం చైతన్యం కావాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అరుణ, స్కూల్ టీచర్ సరోజినిదేవి, అంగన్‌వాడీ టీచర్లు వెంకటలక్ష్మి, సువర్ణమ్మ, ఆశా వర్కర్ వరలక్ష్మి పాల్గొన్నారు.

బాలల భవిష్యత్తును తీర్చిదిద్దాం

గట్టు: బాలల బంగారు భవిష్యత్‌కు పాఠశాలల్లోనే పునాదులు పడతాయని, గ్రామాల్లోని తల్లిదండ్రులు వారి పిల్లలను తప్పని సరిగా బడికే పంపాలని మల్దకల్ ప్రాజెక్టు సీడీపీఓ కమలాదేవి కోరారు. పెంచికలపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో బాలల సంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ బాలలకు 54 హక్కులున్నాయని, వాటిలో ప్రాముఖ్యమైన నాలుగు ఉన్నట్లు తెలిపారు. జీవించే హ క్కు, రక్షణ పొందే హక్కు, భాగస్వామ్యపు హక్కు, అభివృద్ధి చెందే హక్కులున్నట్లు తెలిపారు. వాటిని కాపాడేందుకు పోలీసులు, హెల్త్ డిపార్టుమెంట్, విద్యాశాఖ, మండల అభివృద్ధి శాఖలు పని చేస్తున్నట్లు తెలిపారు. అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు నిండకుండా పెళ్లి చేస్తే నేరం అవుతుందన్నా రు. దీన్ని అతిక్రమించిన వారికి 2 ఏళ్ల జైలుశిక్ష, లక్ష జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. బాల కార్మికుల నిషేధ, నియంత్రణ, సవరణ చట్టం 2016 ప్రకారం పిల్లల చిన్నారుల చేత పనులు చేస్తే రూ.50 వేల జరిమానా, జైలు శిక్ష ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం ఓ ఆర్‌డబ్ల్యూ లక్ష్మీదేవి, హెడ్మాస్టర్ మధుసూ దన్ భ ట్, పోలీస్ కానిస్టేబుళ్లు కృష్ణయ్య, భీమేష్, అంగన్‌వాడీ టీచర్లు సుజాత, ఇంద్రమ్మ, విజయ పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: తల్లిదండ్రులు పిల్లలను తమ సంరక్షణలో ఉంచుకోవాలని సీడీపీఓ సుజాత అన్నారు. ఎర్రవల్లి మండలంలోని జింకలపల్లి, ధర్మవరం ప్రభుత్వ పాఠశాలల్లో బాలల పరిరక్షణ కమిటీ సమావేశాలు నిర్వహించారు. బాలల సమస్యలు, వారి సంరక్షణపై విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఆమె చర్చించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ శివలీల, సూపర్‌వైజర్ దస్తగిరి, హెచ్‌ఎంలు రత్నయ్య, ఉమామహేశ్వర్ ఉన్నారు.

మండలంలోని వేములలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా బాలల సంరక్షణ లీ గల్ అధికారి శివ హాజరై బాలల చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీసీ సూపర్‌వైజర్ సంధ్య, ప్రధానోపాధ్యాయులు శ్రీశైలం, చంద్రకళ, ఉపాధ్యాయులు, ఆశాలు, అంగన్‌వాడీ సిబ్బందిఉన్నారు.

శాంతినగర్: బాలల పరిరక్షణే లక్ష్యంగా కైలాస్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ పనిచేస్తుందని ఆ సంస్థ సోషల్ మొబిలైజర్ లత అన్నారు. శాంతినగర్‌లో బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. కిషోర బాలికల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. అందరితో ప్రతిజ్ఞ చేయించారు.

అయిజ: బాలలందరూ సురక్షిత ప్రాంతాల్లో పెరగాలని ఎంపీడీఓ వెంకటయ్య అన్నారు. మండలంలోని ఎక్లాస్‌పురంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలల సంరక్షణ కమిటీ కార్యక్రమం నిర్వహించారు. లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించేందుకు 2012లో చట్టం రూపొందించారని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎల్లమ్మ, గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రదీప్, పాఠశాల హెడ్ మాస్టర్ బాబు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నె పాఠశాలలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం సూపర్‌వైజర్ సురేఖ ఆధ్వర్యంలోని విద్యార్థులకు బేటీ బచావో.. బేటీ పడావో పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు బాల్య వివాహాలు, బాలల హక్కులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాలల అక్రమ, రవాణా, బాలబాలికల ఆరోగ్య జాగ్రత్తలు, బాల కార్మికుల నివారణ, బడి బయట పిల్లలు బడిలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని చైల్డ్‌లైన్ 1098 తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్ట్ సరోజ, చిట్టెమ్మ, సఖి సీఏ కవిత, హెచ్‌ఎం విజయ భాస్కర్, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు ఉన్నారు.



పెంచికలపాడులో బాలల హక్కుల పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు



వేములలో బాలల చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా లీగల్ అధికారి శివ



శాంతినగర్‌లో మాట్లాడుతున్న చిల్డ్రన్స్ ఫౌండేషన్ సంస్థ మొబిలైజర్ లత

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం



ఏబీవీపీ జెండాను ఆవిష్కరిస్తున్న సంబాగ్ ప్రముఖ్ బీజాపూర్ కరేందర్ నాథ్

గద్వాల అర్బన్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) 76వ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏబీవీపీ సంబాగ్ ప్రముఖ్ బీజాపూర్ కరేందర్‌నాథ్ ముఖ్య అతిథిగా హాజరై ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1949వ సంవత్సరం జూలై 9న ఏర్పాటైందన్నారు. విద్యారంగ సమస్యలపై మరింత పోరాటాలు చేస్తూ జాతీయ సమైక్యతపై కృషి చేస్తామన్నారు. అనంతరం కళాశాల ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గణేష్, జిల్లా ప్రముఖ్ ఆంజనేయులు, జిల్లా కన్వీనర్ సురేష్, నాయకులు నరేష్, వీరశేఖర్, అనిల్ ఉన్నారు.

అయిజ: ఏబీవీపీ 76వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో జెండా ఆవిష్కరణ చేశారు. పాత బస్టాండ్ నుంచి కర్నూల్ రోడ్డు చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేష్ మాట్లాడారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 75 ఏళ్లుగా ఎన్నో విద్యారంగ సమస్యలపై పోరాటం చేస్తోందన్నారు. కార్యక్రమంలో సతీష్, నరేష్, మురళి, శ్రీను, లోకేష్, శ్రీధర్‌రెడ్డి,, వంశీ, రహీం, విజయ్, సత్య, రాఘవేంద్ర, బషీర్, శ్రీహరి, విద్యార్థులు పాల్గొన్నారు.

నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలి

గద్వాల క్రైం: జిల్లా వ్యాప్తంగా నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసులో బాధితులకు ప్రభుత్వం అందించే నష్టపరిహారం కొన్ని నెలలుగా అందడం లేదని మంగళవారం ఉదయం ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు గద్వాల డీఎస్పీ సత్యనారాయణను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వివిధ పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసుల విచారణలో జాప్యం కనబర్చకుండా వీలైనంత త్వరగా విచారణ చేపట్టి బాధ్యులకు శిక్షపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులకు ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సహాయం అందేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అశోక్, శ్రీనివాసులు, ఇమ్మానియేలు, ఆంజనేయులు, ఊశన్న తదితరులు ఉన్నారు.

చెట్లకు రక్షణ ఏది?



జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ శ్రీ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయ పరిసరాలలో, ఆలయ ప్రాంగణంలో చెట్లకు రక్షణ కరువైంది. ఆలయంలోని ప్రకార మండపంలో ఆవులు దూడలు, మేకలు సంచరిస్తూ చెట్లను మేసేస్తున్నాయి. దీంతో చెట్లు పెరగకముందే అంతరించిపోయే ప్రమాదం నెలకొంది. ఆల య ప్రాంగణంలో భక్తులకు కనువిందుచేయడంతో పచ్చదనం వెల్లివిరిసేందుకు పర్యాటక శాఖ వారు లక్షలాది రూపాయలను వెచ్చించి ఏర్పాటు చేసినా, లక్ష్యం నెరవేరకపోగా వాటికి విఘాతం కలుగుతోంది. దేవస్థానం వారు చెట్లను కాపాడాలని కోరుతున్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



జల్లాపురంలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పాఠశాల ఉపాధ్యాయ బృందం

మానవపాడు: మండలంలోని జల్లాపురంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు సాధారణ బదిలీలో భాగంగా 12 ఏళ్ల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులను అమరేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రాధాకృష్ణరెడ్డి, సురేష్‌బాబు, నాగేంద్రబాబు తదితరులకు పాఠశాల యజమాన్యం, విద్యఅభిమాని సుగుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పూలమాల, శాలువాతో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్, మురళి, వెంకన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగికి బదిలీలు సహజమే

ధరూరు: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ సహజమేనని, పని చేసిన చోట మంచిపేరు సంపాదించుకోవాలని ధరూరు ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి, హెచ్‌ఎంలు జోత్స్న, యోగేందర్‌లు అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్తున్న హెచ్‌ఎం రేవతి, ఉపాధ్యాయురాలు నీలావతిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కిషోర్‌చంద్ర, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.



బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్‌ఎంలు

వీధిలైట్లు లేక అవస్థలు



అంధకారంలో రామచంద్రానగర్ కాలనీ

శాంతినగర్: వడ్డేపల్లి పట్టణ పరిధిలోని రామచంద్రానగర్ కాలనీలో వీధిలైట్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రామచంద్రానగర్‌లోని కొన్ని వీధుల్లో నాలుగు రోజులుగా వీధిలైట్లు పడటం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. వీధిలైట్లు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో బయటకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి వీధిలైట్లకు మరమ్మతులు చేయించి ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

రాజోళి-వడ్డేపల్లి రోడ్డుకు మోక్షమెప్పుడో?



వర్షానికి గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

రాజోళి: రాజోళి-వడ్డేపల్లి ప్రధాన రోడ్డుకు మోక్షం ఎప్పుడు కలుగుతుందా? అని రెండు మండలాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఏళ్ల తరబడి గుంతల రోడ్డుపై ప్రమాదాల బారిన పడుతూ ప్రయాణం చేస్తున్నా, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. రాజోళి-వడ్డేపల్లి రోడ్డు ఏళ్ల తరబడి గుంతలమయంగా ఉండడంతో గ్రామస్తులు వినతులు, ధర్నాలు చేయగా, రాజోళి శివారు నుంచి బీటీ వేశారు. కానీ అక్కడి నుంచి శాంతినగర్ వరకు గుంతలమయంగానే ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు టిప్పర్లు పెద్ద ఎత్తున మట్టిని తరలిస్తూ తిరుగుతుండటంతో మోకాలి లోతు గుంతలు ఏర్పడ్డాయి. దీంతో చిన్న వర్షం కురిసినా రోడ్డుపై నీరు నిలిచి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. సోమవారం కురిసిన వర్షానికి ప్రధాన రోడ్డు మొత్తం బురదమయం కావడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ రోడ్డును బాగు చేస్తే రెండు మండలాలతో పాటు కర్నూల్ జిల్లాలోని పలు ప్రాంతాలకు వెళ్లేందుకు మార్గం సుగమవుతుంది. త్వరగా రోడ్డు బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆరోగ్య మహిళా కార్యక్రమం



ఆరోగ్యకేంద్రంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రిజ్వానా తాన్విర్

మానవపాడు: మండలం కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డాక్టర్ రిజ్వానా తాన్విర్ ఆధ్వర్యంలో మహిళా ఆరోగ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మహిళా ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా నోటి క్యాన్సర్, రొమ్ము, రక్తహీనత, మహిళల రుతుశ్రవం సమస్యలు, మోనోపాజ్ సమస్యలు, మూత్రనాళం సమస్యలు, మానసిక స్థితి, అనారోగ్యసమస్యలపై మందులు అందించినట్లు తెలిపారు. మహిళా ఆరోగ్య కార్యక్రమంలో 38మంది మహిళలకు వైద్య పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో సత్యనారాయణ, హెలెన్, చంద్రన్న, సంధ్యారాణి, తిరుమాల్‌రావు, సోని, రేవతి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ నాయకుల ఒత్తిడి ఆపాలి



డీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు, కార్మికులు

గద్వాల అర్బన్: జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీల్లో రాజకీయ నాయకుల మాటలు విని ఎంపీడీఓ, కార్యదర్శులు కార్మికులకు నోటీసులు పంపడం సరికాదని, కార్మికులపై రాజకీయ నాయకుల ఒత్తిడి ఆపాలని ఐఎఫ్‌టీయూ కోశాధికారి జమ్మిచేడు కార్తీక్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీలో డీపీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పగలు, రాత్రి గ్రామాభివృద్ధి కోసం పాటుపడుతున్న కార్మికులను నిర్ధాక్షిణంగా తొలగించాలని నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హరీష్, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణ, కోశాధికారి జమ్మిచేడు కార్తీక్, మధు, వెంకటేశ్వరమ్మ, రంగన్న, జమ్మన్న, నర్సింహులు ఉన్నారు.

ప్రతిపల్లెకు బస్సులు నడపాలి



లింగన్‌వాయిలో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద

అలంపూర్ రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు అమలు జరిగినప్పటికీ గద్వాల జిల్లాలోని కొన్ని మండల కేంద్రాలలోని కొన్ని గ్రామాలకు ఇప్పటి వరకు బస్సు సౌకర్యం లేకపోవడం బాధాకరమని ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద అన్నారు. మండలంలోని లింగన్‌వాయి గ్రామంలో మంగళవారం ఐద్వా ముఖ్యకార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, విద్యార్థులు ఇలా అనేక రకాల ప్రజలకు పల్లె వెలుగు బస్సులు లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారన్నారు. బస్సుసౌకర్యం లేని ప్రతిగ్రామానికి బస్సు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పల్లె వెలుగు బస్సు ఏర్పాటు కోసం ప్రత్యేక ఆందోళనలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో జీకే సుజాత, రాణి, సుభద్ర, లలిత, లక్ష్మీదేవి ఉన్నారు.

పాఠశాలల్లో కనీస వసతులు కరువు



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్

గద్వాల అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్ మండిపడ్డారు. మంగళవారం జిల్లా కేంద్రంలో మోమిన్ మహల్లాలోని ఇంగ్లిష్ మీడియం స్కూల్, ఎంబీ పాఠశాల, ప్రాక్టీసింగ్ హైస్కూల్, ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల కొరత ఉందని, పాఠశాలల్లో మూత్రశాలలు, తాగునీరు, గదుల కొరత, కనీస వసతులు లేవన్నారు. మధ్యాహ్న భోజనానికి నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 'మన ఊరు-మన బడి' నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. లేని పక్షంలో విద్యార్థులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కన్వీనర్ అంజి, శైలేష్‌కుమార్, అనిల్, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

గురుకులాల్లో భోజన సమయం పాటించాలి



మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థుల భోజనం పరిశీలిస్తున్న నాయకులు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో భోజన కార్యక్రమాన్ని సీపీఎం నాయకులు మంగళవారం పరిశీలించారు. మైనార్టీ గురుకుల పాఠశాలలో గతంలోనే విద్యార్థుల భోజన సమయం బాగుందని, ప్రస్తుతం భోజన సమయం బాగలేదని టైం టేబుల్ పాటించాలన్నారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు మద్దిలేటి, వెంకటేశ్వర్లు, ఈదన్న, తదితరులు పాల్గొన్నారు.

ముళ్ల పొదలను తొలగించండి



ముళ్లపొదలు తొలగిస్తున్న సిబ్బంది

అయిజ: మున్సిపాలిటీలోని వివిధ కాలనీల్లో దట్టంగా అలుముకున్న ముళ్ల పొదలను తొలగించాలని పట్టణ ప్రజలు మున్సిపల్ అధికారులను కోరారు. మంగళవారం పట్టణంలోని 9,17వ వార్డులను మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, వైస్ చైర్మన్ మాల నరసింహులు, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలు వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అనేక చోట్ల ముళ్ల పొదలు అలుముకున్నాయని, వాటివల్ల పాముల బెడద ఉందన్నారు. డ్రెయినేజీలో మురుగు తొలగించకపోవడం వల్ల దుర్వాసన వెదజల్లుతుందని, దోమలు వ్యాప్తిచెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారని వాపోయారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యలను వీలైనంత వరకు పరిష్కరిస్తామని అధికారులు ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో 17వ వార్డు కౌన్సిలర్ శశికళ, జూనియర్ అసిస్టెంట్లు విజయ్, పవన్, ప్రకాష్, వార్డు ఆఫీసర్లు, లైన్‌మెన్‌లు, బిల్ కలెక్టర్లు జవాన్లు, ఎలక్ట్రిషియన్లు పాల్గొన్నారు.